క్లుప్తంగా

రిటైర్డు ఎంఈఓ మృతి


నాగభూషణం (ఫైల్)

ఎమ్మిగనూరు: రిటైర్డు ఎంఈఓ నాగభూషణం (65) గురువారం రాత్రి మృతి చెందారు. నంద వరం మండలం సోమల గూడూరుకు చెందిన నాగభూషణం గణితం మాస్టారుగా, ఎంఈఓగా, డిప్యూటీ విద్యాదాధికారిగా పని చేశారు. రిటైర్డు అయిన నాగభూషణం స్థానిక శాంతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం బాత్‌రూంలో కాలుజారి పడిపోయాడు. మెదడులో రక్తం గడ్డ కట్టింది. ఈ స్థితిలో గురువారం రాత్రి 10.30 సమయంలో ముక్కు, నోటి నుంచి రక్తస్రావం జరిగి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. నాగభూషణంకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పలువురు రిటైర్డు ఉద్యోగులు, ఎంఈఓలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సారా విక్రేతల అరెస్ట్

వెల్దుర్తి: మండల పరిధిలోని బుక్కాపురం, బోయనపల్లెలో శుక్రవారం స్థానిక పోలీసులు, సెబ్ బృందంతో సంయుక్తంగా జరిపిన దాడులలో ఐదుగురు సారా విక్రేతలను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నిందితులైన బోయనపల్లె రామాంజనేయులు వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా, బుక్కాపురం లక్ష్మన్న, మద్దిలేటి, చంద్రన్న, మద్దమ్మ నుంచి 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్కసుతో దాడి

తుగ్గలి: పింఛన్ తొలగించేందుకు కారణమయ్యారనే అక్కసుతో ఓ వ్యక్తి దాడి చేయగా వీఆర్‌ఏ, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. జొన్నగిరి ఎస్‌ఐ రామాంజినేయులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఉప్పర్లపల్లి వీఆర్‌ఏ రమేష్, అదే గామానికి చెందిన హోటల్ శేఖర్, సూర్యతండ వెంకటేష్ నాయక్ గురువారం రాత్రి గ్రామ సమీపంలోని సత్రం వద్ద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. గ్రామానికి చెందిన హోసూరు కృష్ణ అనే వ్యక్తి అక్కడికి వెళ్లి 'మా అక్క పింఛన్ తొలగిపోయేలా చేస్తావా అంటూ రాడ్డుతో వీఆర్‌ఏపై దాడికి దిగాడు. వెంకటేష్ పారిపోగా అడ్డుకోబోయిన శేఖర్‌పై కూడా దాడి చేయడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కృష్ణపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంపీడీఓ విశ్వమోహన్, ఎంఈఓ మద్దయ్య

కృష్ణగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని ఎంపీడీఓ విశ్వ మోహన్ సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన ఎంఈఓ మద్దయ్యతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం తిన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో రోజూ ఉదయం ప్రార్థన, సమయపాలన, క్రమశిక్షణ నేర్పించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని హెచ్‌ఎం కల్పనకు సూచించారు.

కొలువుదీరిన పీర్లు


మద్దికెరలో కొలువుతీరిన పీర్లు

మద్దికెర: కులమతాలకు అతీతంగా జరుపుకునే పీర్ల పండగ సందర్భంగా మండలంలోని మద్దికెర, పెరవలి, హంప, ఎం.అగ్రహారం గ్రామాల్లో శుక్రవారం చావిడిలలో పీర్లు కొలువుదీరాయి. మొహర్రం నెలలో నిర్వహించుకునే పీర్ల పండగ పురస్కరించుకొని చావిళ్లను అందంగా అలంకరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ పీర్ల పండుగను తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈనెల 26న చిన్న సెరిగత్తు, 28న పెద్ద సెరిగెత్తు, 29న పారువేట సందర్భంగా పీర్లను గ్రామ పురవీధుల గుండా ఊరేగించి అనంతరం జలధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు నిర్మించాలి

దేవనకొండ: మండలకేంద్రానికి మూడు కి.మీ. దూరంలో ఉన్న కొత్తపేట గ్రామానికి రోడ్డు అధ్వానంగా ఉందని, రోడ్డు వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ ఆలూరు ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. రోడ్డు వేసేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సెమిస్టర్-2 పుస్తకాలు పంపిణీ

కృష్ణగిరి: మండలంలోని 46 ప్రభుత్వ పాఠశాలలకు సెమిస్టర్-2 పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ మద్దయ్య తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక కార్యాలయం నుంచి ఎండీయూ వాహనంలో పుస్తకాలను పాఠశాలలకు తరలించారు. మండలంలో ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న 6,800 విద్యార్థులకు 20,116 పుస్తకాలు వచ్చాయన్నారు. ఆయా పాఠశాలల్లో శనివారం విద్యార్థులకు పుస్తకాలు అందజేసి ఆ ఫొటోలను అప్‌లోడ్ చేయాలని హెచ్‌ఎంలను, సీఆర్పీలను ఆదేశించారు.

పక్కాగా ఓటర్ల లెక్క

- శుక్రవారం నుంచి ప్రారంభమైన జాబితా సవరణ
- వచ్చే నెల 21 వరకు ఇంటింటికీ వెళ్లనున్న బీఎల్‌ఓలు
- ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులకు అవకాశం
- అక్టోబర్ 17న ముసాయిదా జాబితా ప్రచురణ


ఆలూరు మండలం కురువళ్లి గ్రామంలో ఓటరు సర్వే చేస్తున్న బీఎల్‌ఓ, సిబ్బంది


ఓటరు జాబితా సవరణపై బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న ఈఆర్వో మల్లికార్జున

ఆలూరు రూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణపై నియోజకవర్గ యంత్రాంగం దృష్టి సారించింది. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. 2024 జనవరి 1 నాటికి పద్దెనిమిదేళ్లు నిండే వారందరికీ కూడా ఓటు హక్కు కల్పిస్తారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో నమోదైన ఓటు శాతం పరిగణలోకి తీసుకుని ఓటింగ్ శాతం పెరగడానికి, తగ్గడానికి గల కారణాలు ఈ సర్వేలో గుర్తిస్తారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణపై బూత్ లెవల్ అధికారులకు ఇప్పటికే మండల కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరగాలని సూచించారు. ఆలూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి మల్లికార్జున పర్యవేక్షణలో ఆయా మండల తహసీల్దార్లు, సహాయ ఎన్నికల అధికారులు సహకారం అందిస్తారు. జాబితా సవరణపై ఎన్నికల సంఘం గుర్తించిన రాజకీయ పార్టీల నాయకులకు సైతం అవగాహన కల్పించారు. బీఎల్‌ఓలకు ఇచ్చిన ప్రత్యేక యాప్‌లో సవరణ వివరాలు నమోదు చేస్తున్నారు. తాజా లెక్కల ప్రకారం ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 294 పోలింగ్ కేంద్రాల్లో జూలై 4వ తేదీ నాటికి 2,49,233 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

సర్వేలో పరిశీలించే అంశాలు..

- జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లను గుర్తించి తొలగిస్తారు.
- వందేళ్లు పైబడిన ఓటర్లను గుర్తిస్తారు. చనిపోయిన వాటి ఓటు హక్కును తొలగిస్తారు.
- ఇంటి నంబర్ లేకున్నా, ఒకే ఇంటి నంబర్‌లో పది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్నా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు.
- సర్వీసు ఓటర్లు (మిలటరీ) ఎన్‌ఆర్‌ఐ ఓట్ల వివరాలు సరి చేస్తారు.
- దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి ఇష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో అడిగి అక్కడే నమోదు చేస్తారు.
- ఒకే పోలింగ్ కేంద్రంలో 1,500 మందికి పైగా ఓటర్లు ఉంటే కొత్త కేంద్రాన్ని సిఫారసు చేయడం. పేర్లు, నియోజకవర్గం, చిరునామా, ఫోన్ నంబర్, ఫొటో గుర్తింపు కార్డులో మార్పులు, చేర్పులు, తప్పులు, ఒప్పులు సరిచేస్తారు.
- ఓటర్ల అభ్యర్థన మేరకు అనువుగా పోలింగ్ కేంద్రాలు, ఓట్లు ఒక చోట నుంచి మరో చోటికి మారుస్తారు.

షెడ్యూల్ ఇలా..

- ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తారు.
- ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల సర్దుబాటు, విభజన, ప్రతి పోలింగ్ కేంద్రానికి 1,500 ఓట్లు ఉండేలా సర్దుబాటు చేయడం, ఎక్కువ, తక్కువ ఉంటే సమీప పోలింగ్ కేంద్రాల్లో కలపుతారు.
- గుర్తింపు కార్డులు, జాబితాలోని తప్పుల సవరణలో భాగంగా స్పష్టత లేని ఫొటోలు గుర్తించి తొలగించడం. అనంతరం ఎన్నికల కమిషన్ ఆమోదానికి పంపడం.
- సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు ఫారం-1 నుంచి ఫారం-8 వరకు పరిశీలిస్తారు. అదనంగా పెరిగిన, తగ్గిన ఓటర్ల జాబితా రూపొందించడం
- అక్టోబర్ 17 ముసాయిదా జాబితా ప్రకటన. దీనిపై అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ.
- శని ఆదివారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం.
- డిసెంబర్ 26వతేదీ నాటికి ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించడం.
- వచ్చే ఏడాది జనవరి 1వ తేదీన సిద్ధం చేసిన ఓటర్ల జాబితాను ఆమోదించడం.
- జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రదర్శిస్తారు

పారదర్శకంగా జాబితా సవరణ

ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి తప్పొప్పులను సరిచేస్తున్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరికీ ఓటు హక్కు కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆయా మండలాల తహసీల్దార్లు పర్యవేక్షిస్తారు. ఇందు కోసం ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేశాం. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించాం. – మల్లికార్జున, ఈఆర్వో, ఆలూరు

ఆలూరు నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
ఆలూరు	21,229	21,045	10	42,284
ఆస్పరి	26,076	25,010	7	51,093
చిప్పగిరి	12,433	12,244	4	24,681
హాలహర్వి	17,758	17,831	10	35,599
హొళగుంద	20,330	19,698	15	40,043
దేవనకొండ	28,473	27,057	3	55,533
మొత్తం	1,26,299	1,22,885	49	249233

నెలాఖరు వరకు విత్తనం వేయొచ్చు

మద్దికెర: ఎర్రనేలల్లో తేలికపాటి వర్షాలకు ఈ నెలాఖరు వరకు వేరుశనగ, పత్తి, ఆముదం విత్తనం వేయవచ్చని ఏఓ రవి తెలిపారు. శుక్రవారం పొలాలలో పర్యటించి సస్యరక్షణ పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నివారణపై రైతులకు అవగాహన వుండాలన్నారు. అపాచి (ఫ్లోనికామైడ్, ఫిప్రోనిల్) 0.8 గ్రా. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే గులాబీరంగు పురుగు నివారణకు కైట్ (ఇండాక్సాకార్బ్, అసిటామ్రిడ్) 160 మి.లీ ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. వేరుశనగలో ఆకుముడత పురుగు నివారణకు సోలోమెన్ 1 ఎంఎల్ లీటర్ నీటిలో లేదా ఫెంథోమేట్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆముదం పంటలో నత్తల నివారణకు ఆరోసిన్ గుడ్డలు పొలంలో వేసి ఉంచి తిరిగి కాల్చివేయాలన్నారు. లేదా మెటాల్డిహైడ్ ఎకరా పొలంలో చల్లుకోవాలన్నారు. వీఏఏ జాకీర్ ఉన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

ఆలూరు: కులమతాలకు అతీతంగా జరుపుకునే మొహర్రం వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, ఆలూరు మండలాల్లో సమస్యాత్మక గ్రామాల్లో గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. అల్లర్లకు పాల్పడే వారిపై నిఘా ఉంచాలన్నారు. అలాగే అక్రమ మద్యం విక్రయాలు ఇతర అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు.

'జగనన్న సురక్ష' పేదలకు వరం


మసీదుపురంలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరురూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని, అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారుంటే సురక్ష కార్యక్రమం ద్వారా పథకాలు పొందవచ్చని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో నిర్వహించిన సురక్ష కార్యక్రమానికి ఆయన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే సురక్ష కార్యక్రమం లక్ష్యమన్నారు. గతంలో వివిధ సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఆ సమస్య లేకుండా దరఖాస్తు చేసుకుంటే గంటల వ్యవధిలోనే సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొల్ల కేశన్న, సర్పంచ్ నాగమ్మ, వైస్ సర్పంచ్ తిప్పన్న, పోలయ్య, మండల ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, ఎంపీడీఓ బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలి


వెల్దుర్తిలో ధృవీకరణ పత్రాలు అందుకుంటున్న ఉస్మాన్‌బాష దంపతులు

వెల్దుర్తి: 'సీఎం జగనన్న అందరికీ మంచి చేస్తున్నాడు. ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలి' అంటూ జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందుకున్న వెల్దుర్తి 1వ వార్డుకు చెందిన ఉస్మాన్‌బాష అన్నారు. శుక్రవారం స్థానిక సచివాలయం-2 పరిధిలో డీటీ ఎ.ప్రసాద్‌రాజు, ఈఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సంతబజారులో నిర్వహించిన కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, ఎంపీటీసీ దేవమ్మ, వైఎస్సార్సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు చేతుల మీదుగా 526 సర్వీసులకు చెందిన ధృవీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడిన అనంతరం ధృవీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడేందుకు ఈఓ అవకాశమివ్వడంతో ఉస్మాన్‌బాషా జగనన్నే ప్రభుత్వమే మళ్లీ రావాలంటూ అభిలాష వ్యక్తం చేశాడు. పలువురు లబ్ధిదారులు సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

సందేశాత్మక చిత్రాలు అవసరం


ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరిస్తున్న 'లిల్లీ' చిత్ర హీరో

ఎమ్మిగనూరుటౌన్: మారుతున్న కాలానుగుణంగా సందేశాత్మక చిత్రాలు తీయాలని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సూచించారు. ఈ నెల 7వ తేదీన విడుదలైన 'లిల్లీ' సినిమాలో హీరోగా నటించిన ఆదోని పట్టణానికి చెంచిన రాజ్‌వీర్ శుక్రవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సినిమా విశేషాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఫ్యామిలీ ఓరియంటెడ్‌గా నిర్మించిన ఈ చిత్రంలో స్నేహంతో పాటు హెల్పింగ్ నేచర్ కథాంశంతో చిన్నపిల్లలను ఆకట్టుకునేలా పాన్ ఇండియా లెవల్‌లో తెలుగు, కన్నడ, తమిళం, మళయాళం, హిందీ బాషల్లో రిలీజ్ చేయగా దేశ వ్యాప్తంగా 500 థియేటర్లలో ప్రదర్శితమౌతున్నట్లు తెలిపారు. సినిమాను హీరో ల్యాప్‌ట్యాప్‌లో ఎమ్మెల్యేకు చూపించగా, ఇలాంటి సినిమాలు నేటి తరం పిల్లలకు అవసరమన్నారు. సినీ హీరో సన్నిహితుడు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు వినయ్‌కుమార్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ బంగిశ్రీరాం పాల్గొన్నారు.

కొనసాగుతున్న భూసర్వే

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూసర్వే మండల పరిధిలోని హంప గ్రామంలో కొనసాగుతోందని తహసీల్దార్ నాగభూషణం శుక్రవారం తెలిపారు. మండలంలో ఇప్పటికే బసినేపల్లి, మదనంతపురం గ్రామాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. భూసర్వే వల్ల రైతుల పొలాలకు హద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయితే అన్ని రకాలు సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

పోలింగ్ బూత్ తనిఖీ

హొళగుంద: మండల కేంద్రంలో శుక్రవారం హౌస్ టు హౌస్ సర్వేలో భాగంగా తహసీల్దారు హుసేన్‌సాహెబ్ పోలింగ్ బూత్ 45ను తనిఖీ చేశారు. బీఎల్‌ఓలకు పలు సూచనలు ఇచ్చారు. ఓటరు జాబితాలో తప్పొప్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. ఓటు హక్కు, గుర్తింపు కార్డులో చేర్పులు, మార్పులు, పేర్లు నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని బీఎల్‌ఓలను హెచ్చరించారు. ఆయనతో పాటు ఆర్‌ఐ దినోజ్, వీఆర్‌ఓ విజయలక్ష్మి ఉన్నారు.

మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి

హాలహర్వి: మండలంలోని బిలేహాల్ గ్రామంలో శుక్రవారం ఏఓ శివశంకర్ ఆధ్వర్యంలో సైన్ అండ్ సింటమ్స్‌పై పొలంబడి కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ.. పంటలకు రసాయనిక మందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చేతులకు గ్లౌజులు, ముక్కుకు మాస్క్, కళ్లకు అద్దాలు పెట్టుకోవాలని సూచించారు. మందుల పిచికారీ పూర్తయిన తర్వాత గ్లౌజులు, మాస్క్ వంటి వాటిని పాతిపెట్టాలని, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. అస్వస్థతకు గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ మేకల మంజుల, వీఏఏ రాజేంద్ర, రైతులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలను ఆదుకోవాలి

చిప్పగిరి: చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి రెండు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని వీఆర్‌ఏలు శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో రెండో రోజుగా నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నామినీగా పని చేస్తున్న వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని, రికవరీ చేసిన టీఏ, డీఏలను వెనక్కి ఇస్తూ డీఏ తో కూడిన వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

చిన్న సినిమాలను ఆదరించాలి


ఇన్‌ఫార్మర్ చిత్రం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, చిత్ర యూనిట్

ఎమ్మిగనూరుటౌన్: సందేశాత్మకంగా నిర్మించే చిన్న సినిమాలను ప్రేక్షలు ఆదరించాలనే అప్పుడే సినీరంగంలో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు పేర్కొన్నారు. ఎమ్మిగనూరుకు చెందిన వినోద్‌రెడ్డి, చాందినీ హీరో హీరోయిన్లుగాను స్థానికులైన డైరెక్టర్ వసంత్‌కుమార్, నిర్మాతలు ఉమాదేవి, అగ్రహారం నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన ఇన్‌ఫార్మర్ చిత్రం పోస్టర్‌తో పాటు ట్రైలర్‌ను శుక్రవారం ప్రముఖ సినీ నిర్మాతలు రూపా జగదీష్, సంజీవరెడ్డి, సినీ తారాగణంతో కలిసి చైర్మన్ ఆవిష్కరించారు. ప్రేమతో పాటు క్రైం తదితర అంశాలతో సందేశాత్మకంగా నిర్మించిన ఈ సినిమాను ఆదివారం విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు.

ముమ్మరంగా ఓటరు వెరిఫికేషన్ సర్వే


వెల్దుర్తి రైల్వేస్టేషన్ కాలనీలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరాముడు

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామంలో శుక్రవారం బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ సర్వే చేపట్టారు. కొత్తగా ఓటర్లుగా నమోదైన వారు, చనిపోయిన ఓటర్లను గుర్తిస్తున్నట్లు సర్వే డీటీ బ్రహ్మయ్య తెలిపారు. అలాగే ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. వీఆర్వోలు ఈరన్న, రామాంజనేయులు, తిప్పన్న, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఆలూరు: నియోజకవర్గంలోని ఆరు మండలాలల్లో ఓటర్ల జాబితా సవరణ పక్కాగా చేపట్టాలని ఆర్‌ఓ మల్లికార్జున బీఎల్‌ఓలు, మండలాధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం ఆలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని ప్రజలకు సూచించారు. తహసీల్దారు రామాంజనేయులు, డీటీ బసన్న, బీఎల్‌ఓలు అధికారులు ఉన్నారు.

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో బీఎల్‌ఓలు ఓటరు జాబితా సవరణ పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ నాగభూషణం సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో బీఎల్‌ఓలకు రిజిస్టర్లు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి చనిపోయిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, పెళ్లి చేసుకొని వెళ్లిన వారిని గుర్తించి వివరాలు నమోదు చేయాలన్నారు. వీఆర్వోలు , బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండలంలో 58 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌ఓలు శుక్రవారం ఓటరు జాబితా సర్వే ప్రారంభించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ కాలనీలో వీఆర్‌ఏ అయ్యస్వామి సహకారంతో బీఎల్‌ఓ రామకృష్ణ నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ శివరాముడు పరిశీలించారు. బీఎల్‌ఓలు పారదర్శకంగా సర్వే చేపట్టాలని అన్ని రకాల పరిశీలనల అనంతరం సవరణకు సిఫారసు చేయాలని ఆదేశించారు. ఓటర్లు బీఎల్‌ఓలకు సహకరించాలని కోరారు. ఆర్‌ఐ మస్తాన్, వీఆర్‌ఓ వెంట ఉన్నారు.

రీసర్వే అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చక్రాళ్ల గ్రామంలో సర్వే నంబర్ 39 లో చేపట్టిన రీసర్వేను గ్రామానికి చెందిన కొందరు అడ్డుకుంటున్నారని గొల్ల రామాంజినేయులు, కొలుట్లయ్య శుక్రవారం తహసీల్దారు విష్ణుప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ సర్వేయర్లను అడ్డుకుని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీసర్వే చేపట్టి రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దారు తెలిపారు.

కష్టకాలంలో ఆదుకున్నారు


కర్ణాటకలోని కంప్లి గ్రామానికి వెళ్లి ఈడిగ రంగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జయసూర్య

కృష్ణగిరి:మండలంలోని పోతుగల్లు గ్రామానికి చెందిన ఈడిగ రంగమ్మ 2021 డిసెంబర్‌లో కర్ణాటక రాష్ట్రంలోని కంప్లి గ్రామంలో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్లి అనారోగ్యానికి గురైంది. దీంతో పింఛన్ తీసుకోలేకపోయింది. మూడు నెలలపాటు పింఛన్ తీసుకోకపోతే రద్దవుతుందని తెలుసుకుని వలంటీర్ జయసూర్య వరుసగా రెండు నెలలు కంప్లికి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేశాడు. వలంటీర్ చొరవపై లబ్ధిదారురాలు హర్షం వ్యక్తం చేసింది.

మందులు కొనుక్కున్నా



బెంగుళూరులో ఉన్న నా కూతురిని చూసేందుకు వెళ్లాను. అక్కడ అనారోగ్యానికి గురి కావడంతో డాక్టర్‌ను సంప్రదించగా రెస్ట్ తీసుకోవాలని సూచించాడు. దీంతో అక్కడే నిలిచిపోయా. ఒక నెల గడిచిపోయింది. రెండవ నెల పింఛన్ తీసుకోకపోతే రద్దవుతుందని మా వలంటీరు జయసూర్య బెంగుళూరుకు వచ్చి వరుసగా రెండు నెలలు పింఛన్ అందించాడు. ఆ సమయంలో పింఛన్ సొమ్ము మందులు కొనేందుకు ఉపయోగపడింది. రానుపోను 600 కి.మీ ప్రయాణించి పింఛన్ అందించిన అతని మేలు మర్చిపోలేనిది.
– ఈడిగ రంగమ్మ, పోతుగల్లు గ్రామం

వైద్యులు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న మంత్రి జయరాం

ఆలూరు: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి గుమ్మనూరు జయరాం వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు తమ గ్రామాల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లోని పంచాయతీ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కో-ఆపరేటివ్ స్టోర్స్ అభివృద్ధికి కృషి


ఎమ్మిగనూరులోని కో-ఆపరేటివ్ స్టోర్స్ గోదాములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కోఆపరేటివ్ స్టోర్స్ అభివృద్ధికి తన వంతుగా సహాయసహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కో-ఆపరేటివ్ స్టోర్స్ కార్యాలయాన్ని, గోదాములను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా స్టోర్స్‌కు వచ్చే ఆదాయ, వ్యయాలను చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టోర్స్‌కు చెందిన ఖాళీ స్థలంలో మరో రెండు గోదాములను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్‌కు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏఈ శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, అల్లబకాష్ తదితరులు పాల్గొన్నారు.

మిరప సాగులో మెలకువలు పాటించాలి


మాట్లాడుతున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రి

గోనెగండ్ల: ఖరీఫ్ సీజన్‌లో మిరప సాగుచేసే రైతులు తగిన మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత సూచించారు. వారు శుక్రవారం స్థానిక వ్యవసాయం కార్యాలయం వద్ద మిరప రైతులను ఉద్దేశించి మాట్లాడారు. మిరపలో పురుగు, తెగుళ్ల నియంత్రణకు చివరి దుక్కిలో కంపోస్ట్ లేదా పశువుల ఎరువుతో పాటు ఎకరాకు ప్రతిదీ 1 కిలో లీటరు చొప్పున ట్రైకోడెర్మా, సూడో మోనాస్, ఎన్‌పీకే బ్యాక్టీరియా, బవేరియా, మేటారైజియం కలిపి, బెల్లం, నీళ్లు చిలకరించి ఏడు నుంచి పది రోజులు నీడన మాగనిచ్చి చల్లుకోవాలన్నారు. తొలి దశలో ముడత రాకుండా విత్తనంను ఇమిడా క్లోప్రిడ్ 600 ఎఫ్‌ఎస్ మందుతో (20 మిల్లీలీటర్ కిలోకు) కలిపి, విత్తనం, నేల ద్వారా తెగుళ్లు రాకుండా సాఫ్ (3 గ్రాములు కిలోకు) కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. నారుకైతే నారుశుద్ధి చేసి నాటుకోవాలన్నారు. పొలం చుట్టూ మేర సాలుగా 3 లేదా 4 వరుసలు జొన్న, సజ్జ, మొక్క జొన్నను విత్తుకోవాలి. పంట అయిపోతే కంకులు మాత్రం తీసి కర్రలు అలాగే ఉంచాలన్నారు. పురుగు, తెగుళ్ల నియంత్రణలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పురుగు, తెగుళ్ల యాజమాన్యానికి బవేరియా వర్టిసీలియం, సూడామొనాస్ (జీవ క్రిమి నాశనులు) ప్రతి 15 రోజులకు ఒకసారి వేపమందుతో కలిపి పిచికారీ చేయాలన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప ఆరోపించారు. శుక్రవారం స్థానిక స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐటీయూసీ తాలుకా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. 44 లేబర్ చట్టాలను నిర్వీర్యం చేసి 4 లేబర్ కోడ్‌లను మాత్రమే తీసుకొచ్చి కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తుందన్నారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఏఐటీయూసీ తాలుకా నూతన కమిటీకి గౌరవాధ్యక్షులుగా బజారి, అధ్యక్షులుగా వీరేష్, ఉపాధ్యక్షులుగా ముక్తార్, నరసింహ, వీరేష్, కార్యదర్శిగా తిమ్మగురుడులను ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు పంపణ్ణగౌడ్, భాస్కర్‌యాదవ్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.